


ఎంత కష్టం..
బాలుడికి పెద్దకష్టం వచ్చింది. లివర్ వ్యాధితో ఉదర భాగం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో మంచానికే పరిమితమయ్యాడు. 8లో▸



నత్తే నయం!
జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కి అనే చందంగా మారింది. 9లో▸



అండర్ పాస్.. అష్టకష్టాలు
వంతెన పనులు పూర్తికాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం రెండేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనేలా ఉంది. 9లో▸



న్యూస్‌రీల్

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్

అనంతగిరి: జిల్లాలోని తహసీల్ కార్యాలయాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, జనన, మరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పేరుకుపోయాయని, వీటిని పరిశీలించి, వారం రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, ఆర్డీఓలు అశోక్‌కుమార్, విజయకుమారి, అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి రాంరెడ్డితో శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉంటే వీఆర్ఏల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు ఒక్కటి కూడా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. తాండూరు, పరిగి, మర్పల్లి, ధారూరు, కుల్కచర్ల మండలాల్లో అర్హులైన లబ్ధిదారుల నుంచి డబుల్ బెడ్‌రూంల కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా అవసరం మేరకు వార్డుల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలు దరఖాస్తులు చేసుకునే విధంగా మండలాలలో ప్రచారం నిర్వహించాలని, సోమవారం నుంచి శనివారం వరకు దరఖాస్తులు స్వీకరించి వెంటనే విచారణ చేపట్టాలన్నారు.


అభివృద్ధి పనుల పరిశీలన



పార్కును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ట్రైనీ కలెక్టర్ సంచిత్ అగర్వాల్ శనివారం పరిశీలించారు. గంగారంలోని వైకుంఠధామం, గాంధీ కాలనీలోని పార్కును సందర్శించారు. వైకుంఠధామం నిర్మాణం, వినియోగం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలించారు. ఆయన వెంట కమిషనర్ శరత్‌చంద్ర, సిబ్బంది ఉన్నారు.

వందశాతం పన్ను వసూలుకు చర్యలు



వ్యాపారి నుంచి రూ.50 వేల ఆస్తి పన్ను చెక్కు తీసుకుంటున్న కమిషనర్, ఆర్ఓ

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర అన్నారు. శనివారం ఓ వ్యాపారి నుంచి రూ.50 వేల ఆస్తి పన్ను చెక్కు తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టణంలో మొత్తం 14,252 నివాసాలు ఉన్నట్లు తెలిపారు. వీటి ద్వారా రూ.351.69 కోట్ల ఆస్తి పన్ను రావాల్సి ఉండగా మార్చి 25నాటికి రూ.318.34 కోట్లు వసూలు చేశామన్నారు. ఇప్పటి వరకు 90 శాతానికిపైగా ట్యాక్స్ వసూలు చేసినట్లు వివరించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఐదు రోజుల గడువే ఉండటంతో ఈలోపు లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తేనే మెరుగైన సేవలు అందించగలమని స్పష్టంచేశారు. పన్నుల వసూలుకు బిల్ కలెక్టర్లు, ఆర్ఓ తీరిక లేకుండా పనిచేస్తున్నారని కితాబిచ్చారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

తాండూరు: పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తహసీల్దార్ చిన్నప్పలనాయుడు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో నివాసం ఉంటున్నవారు ఈ నెల 27నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



శ్రీవారికి హారతి పడుతున్న దీక్షితులు




సూర్యప్రభ వాహనంపై స్వామివారు

శ్రీనివాస గోవిందా.. శ్రీవేంకటేశా..

కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామివారు సూర్యప్రభ వాహనం, గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు వసంతోత్సవం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. – కొడంగల్

కరోనా కలకలం

- కుల్కచర్లలో ఆరుగురికి పాజిటివ్
- ఆందోళన అవసరం లేదని వైద్యాధికారుల సూచన



కుల్కచర్ల: మండలంలో కరోనా కేసులు కలకలం రేపాయి. చాలా రోజుల తర్వాత కోవిడ్ పాజిటివ్ కేసులు వెలుగు చూడటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పలు గ్రామాలకు చెందిన జ్వరం బాధితులు వైద్య పరీక్షల నిమిత్తం శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. వీరిని పరిశీలించిన వైద్యాధికారి మాధురికి వ్యాధి లక్షణాలపై అనుమానం కలగడంతో కరోనా పరీక్షలు చేయించారు. 126 మందికి టెస్టులు చేయగా.. ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో కుల్కచర్లకు చెందిన ముగ్గురు, ఇప్పాయిపల్లి వాసులు ఇద్దరు, పీరంపల్లికి చెందిన ఓ వ్యక్తి ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. వీరికి మందులు పంపిణీ చేసిన వైద్యాధికారులు హోంఐసోలేషన్‌లో ఉండాలని సూచించారు. ప్రైమరీ కాంటాక్టులను గుర్తించి, వ్యాధి వ్యాప్తి నివారణ చర్యలు చేపడుతామన్నారు. ప్రజలు భయపడొద్దని సూచించారు. ఏమాత్రం అనుమానం వచ్చినా ఆస్పత్రికి వచ్చి కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలని తెలిపారు.

బిల్లులు క్లియర్

జిల్లాలో చేపట్టిన 'మన బడి' పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని, ఇందుకు సంబంధించిన బిల్లులు క్లియర్‌గా ఉన్నాయని, ఎక్కడా పెండింగ్‌లో లేవని మంత్రి సబితారెడ్డి అన్నారు. పలు శాఖల అధికారులు పని తీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు.



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్

- 'మన బడి' పనుల బకాయిలు లేవు
- అవాస్తవాలు చెబితే చర్యలు తప్పవు
- ఇంజనీరింగ్ అధికారులపై మంత్రి సబితారెడ్డి ఆగ్రహం
- ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖల పనితీరు మారాలని హితవు
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- ప్రజా సమస్యలపై గళం విప్పిన సభ్యులు

వికారాబాద్: మద్గుల్ చిట్టెంపల్లిలోని డీపీఆర్సీ భవన్‌లో శనివారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. చైర్‌పర్సన్ సునీతారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పలు సమస్యలపై సభ్యులు గళం విప్పారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం.. పనుల నిర్వహణలో జరుగుతున్న జాప్యం.. పంట నష్టం గుర్తింపులో వివక్ష తదితర అంశాలపై రసవత్తరమైన చర్చ సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సబితారెడ్డి ఎదుటే పలువురు సభ్యులు పరస్పర వాగ్వాదానికి దిగారు. పేపర్ లీకేజీ వ్యవహారంతో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయారని ఓ సభ్యురాలు ఆవేదన వ్యక్తంచేయగా.. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని.. సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సబితారెడ్డి స్పష్టంచేశారు.

చర్చించిన అంశాలివే..

- వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో పాటు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సభ్యులు మండి పడ్డారు. ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మన ఊరి మన బడి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, ఈ బాధ్యతలను మరో శాఖకు అప్పగించాలని సభ్యులు పట్టుబట్టారు. ఇక మీదట పనుల బాధ్యతలను పంచాయతీరాజ్‌కు బదిలీ చేయాలని మంత్రి సబితారెడ్డి కలెక్టర్‌కు సూచించటంతో గొడవ సద్దుమనిగింది.
- ఆర్అండ్‌బీ అధికారుల పనితీరుపై సభ్యులతో పాటు వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాఖ పనితీరు అధ్వానంగా ఉందన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సంబంధిత ఎస్ఈ జనరల్ బాడీ మీటింగ్‌కు హాజరు కాకపోవడంపై జెడ్పీటీసీలు మండిపడ్డారు. ఈ విషయాన్ని పరిశీలించాలని మంత్రి సబితారెడ్డి కలెక్టర్‌కు సూచించారు.
- స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాలలు అధ్వానంగా మారాయని సభ్యులు పేర్కొన్నారు. గ్రామాల్లో ఇష్టారాజ్యంగా వెంచర్లు చేస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయగా ఈ విషయంలో క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటామని డీపీఓ తరుణ్‌కుమార్ హామీ ఇవ్వటంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.
- పంటనష్టం అంచనాలు సరిగ్గా చేయటంలేదని నష్ట పోయిన గ్రామాలను సందర్శించి బాధిత రైతులకు న్యాయం చేయాలని సభ్యులు డిమాండ్ చేయగా.. మరోసారి పంటలు పరిశీలిస్తామని డీఏఓ గోపాల్ హామీ ఇచ్చారు. జిల్లాలో 5,727 మంది రైతులకు సంబంధించి 6,418 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ఇప్పటివరకు గుర్తించామన్నారు.
- అనుకోకుండా ఎవరైనా గుండెపోటుకు గురైతే సీపీఆర్ చేయడం ద్వారా రక్షించుకునే అవకాశం ఉందని మంత్రి సబితారెడ్డి తెలిపారు. సీపీఆర్‌పై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆనంద్, యాదయ్య, మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ కృష్ణారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజుగౌడ్, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి తదితరులు జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి

జిల్లాలో ఎంపిక చేసిన 38 పాఠశాలల్లో మన బడి పనులు పూర్తయ్యాయి. జూన్‌లో బడులు పునఃప్రారంభించే సమయానికి మొదటి ఫేస్‌లో ఎంచుకున్న స్కూళ్లలో పనులన్నీ కంప్లీట్ చేయాలి. మనబడి పేమెంట్స్ ఎక్కడా పెండింగ్‌లో లేవు. కొందరు ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు రావడం లేదని ఆరోపణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. ప్రజాప్రతినిధులు, అధికారులు మనబడి పనులను వేగవంతం చేయాలి. – సబితారెడ్డి, మంత్రి

పారదర్శకంగా కేటాయింపులు

జెడ్పీ నిధుల కేటాయింపు విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాం. అభివృద్ధిలో జిల్లా పరిషత్ ప్రధాన భూమిక పోషిస్తోంది. రైతులు నూనె గింజలు, ఆయిల్ పామ్ తోటల సాగుపై దృష్టిసారించాలి. ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నీటి వృథాను అరికట్టి ఎక్కడా సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది. టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి. – సునీతారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్

త్వరలో కార్యదర్శుల బదిలీ

మండల, జిల్లా జనరల్ బాడీ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలి. ఏదైనా అనారోగ్య సమస్య ఎదురైతే ముందస్తు అనుమతి పొందాలి. ప్రభుత్వం తీసుకువచ్చిన ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయాలి. సెంటీమీటర్ వర్షపాతం కూడా నమోదు కాని మండలాల్లో పంటలు నష్టమయ్యాయంటే నమ్మశక్యంగా ఉండదు. మూడేళ్లు పూర్తయిన పంచాయతీ కార్యదర్శులను త్వరలోనే బదిలీ చేస్తాం. – నారాయణరెడ్డి, కలెక్టర్

పథకాల ఘనత మాదే

- దేశానికే పాఠాలు చెప్పే స్థాయిలో తెలంగాణ
- ప్రగతి నివేదన యాత్ర ముగింపు సభలో మంత్రి కేటీఆర్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన వాడే నిజమైన నాయకుడని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చేరని ఇల్లు లేదని, తొమ్మిదేళ్లలో ఊహించని రీతిలో అభివృద్ధి సాధించామన్నారు. ప్రస్తుతం తెలంగాణ దేశానికే పాఠాలు చెప్పే స్థాయికి చేరుకుందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర శనివారం ముగింపు సందర్భంగా పెద్ద అంబర్‌పేటలోని ఔటర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్న సంకల్పంతో పాదయాత్ర చేపట్టి నియోజకవర్గ ప్రజల్లో స్థానాన్ని సంపాదించిన మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి పట్టుదల అభినందనీయమని పేర్కొన్నారు. ఈ యాత్రలో పది సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని, వాటిని ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని, యువతకు ఉపాధి కల్పించేందుకు వీలుగా అనేక పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. కొంగరలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఫాక్స్‌కాన్ పరిశ్రమ ఏర్పాటు కానుందని, లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

లీకేజీలతో సంబంధం లేదు

పొరపాట్లు జరగడం సహజమేనని, చిన్న తప్పులను పెద్దగా చేసి ప్రభుత్వంపై విపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీలో లీకేజీలు జరిగిన మాట వాస్తవమేనని, దీంతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తప్పిదాలను గుర్తించి, మళ్లీ పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో పరీక్షలను రద్దు చేసినట్లు గుర్తు చేశారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

శంకర్‌పల్లి: మహిళా సాధికారితతోనే దేశ అభివృద్ధి సాధ్యమని, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని గవర్నర్ తమిళిసై అన్నారు. దొంతాన్‌పల్లి గ్రామ శివారులోని ఇక్ఫాయ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే 'మహిళా ఐక్యత సంఘర్షణలు–సంక్లిష్టనలు' అంశంపై నిర్వహించిన సదస్సును ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని సూచించారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు.. నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. మరింత అభివృద్ధి దిశగా సాగాలన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో విధులు నిర్వర్తించడం గర్వకారణమన్నారు. తాము ఎవరికీ తక్కువ కాదని.. మనోధైర్యాన్ని పెంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డెలినా కాగ్ఫ్, ఇక్ఫాయ్ కళాశాల వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎల్.ఎస్.గణేశ్, డైరెక్టర్ ఏవీ నర్సింహారావు, లా స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే.ఎస్.రేఖరాజ్ జైన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవార్డులు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యేలు

అందరి కృషితోనే అవార్డులు

- మంత్రి సబితారెడ్డి
- ఉత్తమ పంచాయతీలకు ప్రశంసాపత్రాలు

వికారాబాద్: సమష్టి సహకారంతోనే పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని మంత్రి సబితారెడ్డి అన్నారు. శనివారం జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉత్తమ పంచాయతీల అవార్డుల ప్రదానోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలోని 27 గ్రామాలు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. సర్పంచులు, కార్యదర్శులు, వీరికి సహకరించిన కలెక్టర్, డీపీఓ, జెడ్పీ సీఈఓ, ఇతర అధికారులను అభినందించటంతో పాటు శాలువాలతో సన్మానించారు. ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన 27 గ్రామాలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. అన్ని శాఖలు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తేనే ఇలాంటి ఫలితాలు సాధ్యమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, యాదయ్య, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, సీఈఓ జానకిరెడ్డి, డీపీఓ తరుణ్‌కుమార్, డిప్యూటీ సీఈఓ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌పై వేటు ప్రజాస్వామ్యానికి చేటు

- ప్రధాని మోదీ నియంతృత్వానికి ఇదే నిదర్శనం
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి
- బీజేపీ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని మండిపాటు
- గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలకు సిద్ధమని ప్రకటన



పరిగిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ప్రధాని మోదీ కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి మండిపడ్డారు. పరిగిలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య చరిత్రలో ఇది ఒక చీకటి రోజని అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం, రాహుల్‌గాంధీపై అనర్హత వేటు దేశ ప్రజలకు విస్మయానికి గురిచేస్తోందన్నారు. మోదీ నియంతృత్వానికి ఇది నిదర్శనమని తెలిపారు. ప్రధాని తన పతనాన్ని తానే కొని తెచ్చుకుంటున్నారని స్పష్టం చేశారు. బీజేపీ పాలనలో జరుగుతున్న అన్యాయాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో వీరికి బుద్ధి చెబుతారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర రాహుల్‌గాంధీ కుటుంబానిదని వివరించారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న రాహుల్ గాంధీపై కక్ష సాధింపు చర్యలు తగవని సూచించారు. బీజేపీ అమలు చేయాలని చూసిన రైతు వ్యతిరేక చట్టాలను రాహుల్ తన పోరాటంతో రద్దు చేయించారని తెలిపారు. ఆదానీ, మోదీ బంధం గురించి రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రశ్నించినందుకు ఆయనపై పగబట్టి కుట్రపూరితంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేశ సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెడుతుంటే రాహుల్ గాంధీ చూస్తూ ఊరుకోరని తెలిపారు. ఆదానీ ఆస్తులపై పార్లమెంటరీ కమిటీ వేసి విచారణ చేయించాలని ప్రతిపక్షాలు గొంతు చించుకున్నా పట్టించుకోని బీజేపీ సర్కారు ఒక్కరోజులోనే రాహుల్‌గాంధీపై అనర్హత వేటు ఎలా వేస్తారని నిప్పులు చెరిగారు. తమ అధినేత, దేశ ప్రజల కోసం కాంగ్రెస్ కార్యకర్తలు పోరాటాలకు ఎప్పుడూ వెనకాడబోరని స్పష్టంచేశారు. గుజరాత్, కర్ణాటక రాష్ట్రంలో ఎంతో మంది బీజేపీ ఎమ్మెల్యేలకు జైలు శిక్ష పడ్డా వారిపై.. అనర్హత వేటు ఎందుకు వేయలేదని నిలదీశారు. బీజేపీ నాయకులకు ఒక న్యాయం ఇతర పార్టీలకు ఒక న్యాయమా అని అసహనం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై గట్టిగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని, రాహుల్‌గాంధీకి అండగా ఉండేందుకు ఎంతవరకైనా తాము సిద్ధమని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి మాధవ్‌రెడ్డి, నాయకులు తౌర్యానాయక్, జగన్, రామకృష్ణారెడ్డి, రాజపుల్లారెడ్డి చిన్ననర్సింహులు, అనం ఆంజనేయులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

అనంతగిరి: జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలువురు జర్నలిస్టు నాయకులు మంత్రి సబితారెడ్డిని కోరారు. శనివారం కలెక్టరేట్‌లో జర్నలిస్టులందరూ కలిసి వినతిపత్రం అందజేశారు. టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ఇటీవల సీఎం ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే జిల్లాలో కూడా పనిచేసే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, డాక్టర్ మెతుకు ఆనంద్, తదితరులు ఉన్నారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి



సాయన్న (ఫైల్)

బంట్వారం: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని వెనుక నుంచి బైకు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శనివారం కోట్‌పల్లి బ్రిడ్జి దగ్గర చోటు చేసుకుంది. కోట్‌పల్లి ఎస్‌ఐ సత్యనారాయణరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుగ్గాపూర్‌కు చెందిన సాయన్న (55) పల్లె ప్రకృతి వనంలో వాచర్‌గా పని చేస్తుంటారు. శుక్రవారం రాత్రి కోట్‌పల్లి నుంచి స్వగ్రామానికి నడుచుకుంటూ వెళ్తున్నారు. బ్రిడ్జి దగ్గర కొత్తపల్లికి చెందిన అంజయ్యను బైక్ వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సాయన్నను కుటుంబీకులు వెంటనే తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య వెంకటమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

28న తైబజార్ వేలం

మొయినాబాద్: స్థానిక సంత (అంగడి) తైబజార్ వేలంపాట ఈ నెల 28న నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ కరిమాబీ షేక్ మహబూబ్, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28న ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీలో తైబజార్ వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు 28న ఉదయం 10.30 గంటలలోపు రూ.10 వేలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

కనులపండువగా స్వామివారి పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న గ్రామస్తులు

షాబాద్: కొమరబండలో కొలువుదీరిన బుగ్గరామేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అగ్నిగుండం, పల్లకీ సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈఓ శ్రీనివాసులు, సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేతలంతా జనం బాట

జిల్లాలో ప్రధాన పార్టీల హోరు

- ప్రజల్లోకి వెళ్తున్న రాజకీయ నాయకులు
- ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్ఎస్ బిజీ
- హాత్ సే హాత్ జోడో అంటున్న కాంగ్రెస్
- కార్నర్ సమావేశాల్లో బీజేపీ



కొడంగల్: జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ప్రజలను కలవడంలో బిజీగా ఉన్నారు. ఇప్పటి నుంచే ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల నేతలు ప్రజల దగ్గరికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసి ప్రజలను కలుస్తున్నారు. హాత్ సే హాత్ జోడో అంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పటికే గ్రామాల్లో జోరుగా పర్యటిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పర్యటించి ప్రజలను కలుస్తున్నారు. రాష్ట్రంలో పాలక వర్గం చేస్తున్న అసమర్థ పాలనను ప్రజలకు వివరిస్తున్నారు. నీళ్లు నిధులు నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రజలను, నిరుద్యోగులను, ఉద్యోగులను, విద్యార్థులను మోసం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లాలో కార్నర్ మీటింగ్‌లు పెట్టి పార్టీ కార్యకర్తల్లో ఉత్తేజం కల్పిస్తున్నారు. ప్రజలకు చేరువ అవుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనకు ముగింపు పలకాలని ప్రజలను కోరుతున్నారు.

ఎన్నికలే లక్ష్యంగా..

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు. ప్రజలను ఆకట్టుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఎన్నికల సమరానికి పార్టీలన్నీ సిద్ధం అవుతున్నాయి. కొడంగల్‌లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనాలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. త్వరలో మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రంలో భారీ స్థాయిలో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సిద్ధం అవుతున్నారు. కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో జరిగే సమావేశాలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్నారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో జరిగే సమావేశాలకు మంత్రి సబితమ్మను ఆహ్వానిస్తున్నారు.

గడప గడపకు కాంగ్రెస్..

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ ఆదేశాల మేరకు జిల్లాలో హాత్ సే హాత్ జోడో యాత్రను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, రూ.2లక్షల వరకు రుణమాఫీ, రూ.500లకే వంట గ్యాస్, ధరణి పోర్టల్ రద్దు వంటి హామీలను ఇచ్చి ప్రజలను ఆకర్శించడానికి ప్రయత్నిస్తున్నారు.

కేంద్ర పథకాలను వివరిస్తూ..

జిల్లాలో బీజేపీ కార్నర్ మీటింగ్‌లు పెట్టి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత భారతదేశం ఖ్యాతి ప్రపంచ దేశాలకు తెలిసిందని ప్రజలకు చెబుతున్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలో కూడా బీజేపీ జెండా ఎగిరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరుతున్నారు. కాషాయ జెండాకు ఓటర్లు పట్టం కట్టే విధంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని బీజేపీ భావిస్తోంది.



హోమం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ధామస్తాపూర్‌లో వైభవంగా పూజలు



హోమం నిర్వహిస్తున్న పురోహితులు, పాల్గొన్న దాతలు

మర్పల్లి: మండల పరిధిలోని ధామస్తాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన పట్లోళ్ల రాధ, జగన్నాథ్ రెడ్డి దంపతులు సొంత డబ్బులు వెచ్చించి నూతన మందిర నిర్మాణం చేపట్టారు. ఆ నేపథ్యంలో ధ్వజ స్తంభం, నవగ్రాహాల స్థాపన వంటి పూజా కార్యక్రమాలను శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహిస్తారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, గౌరీపూజ, ముఖ్యదేవత పూజ, జలాధివాసం, అగ్నిస్థాపన, నవగ్రహ హోమం గణపతి హోమం వంటి కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం సీతారాముల కల్యాణం వేడుకలను అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రెడ్డిశ్రీనివాస్ రాజీనామా

- రేవంత్‌ను కలిసి కాంగ్రెస్‌లో చేరిక



శ్రీనివాస్‌కు పార్టీ కండువా కప్పుతున్న రేవంత్

కొడంగల్: బీఆర్ఎస్ కొడంగల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి రెడ్డిశ్రీనివాస్ పార్టీకి రాజీనామా చేసినట్లు శనివారం ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో రెడ్డిశ్రీనివాస్ పీహెచ్‌డీ చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పోటీ పరీక్షల పేపర్లు లీకేజీకి ప్రభుత్వ అసమర్థతే కారణమని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం స్పందించడంలేదన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌ను తొలగించలేదన్నారు. లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ప్రభుత్వ తీరుకు మనస్తాపం చెంది బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. దౌల్తాబాద్ మండలానికి చెందిన రెడ్డిశ్రీను గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. ఈ మధ్యకాలంలోనే బీఆర్ఎస్‌లో చేరారు. అంతలోనే రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం రేవంత్‌ను హైదరాబాద్‌లో కలిశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రేవంత్‌కు వివరించారు. రేవంత్ చేసే ఉద్యమాలకు బాసటగా ఉంటానని రెడ్డిశ్రీనివాస్ అన్నారు. రెడ్డి శ్రీనివాస్‌కు రేవంత్ కండువా కప్పి అభినందించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

- జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి మోతి

ఇబ్రహీంపట్నం రూరల్: చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని స్త్రీ శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి మోతి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఎల్మినేడులో శనివారం కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మోతి మాట్లాడుతూ.. బాలింతలు, కిశోర బాలికలు, గర్భిణుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవడం చాలా మంచిదన్నారు. ఇప్పటికే అనేక మంది రక్త హీనతతో బాధపడుతున్నారని అలా కాకుండా వారికి సరైన పోషక పదార్థాలు అందిస్తే పుష్టిగా తయారవుతారని చెప్పారు. చిన్నారులు బరువు తక్కువగా ఉంటున్నారని, వారికి ఆకుకూరలు, ఐరన్ ఇచ్చే పదార్థాలు అందించాలన్నారు. ఆరేళ్లలోపు పిల్లల్లో శుభ్రత, ఆరోగ్య కరమైన బరువు ఉండాలంటే తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకురావాలని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఎడ్మా అశోకవర్ధన్‌రెడ్డి, జాయింట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గిరిజ, రాష్ట్ర అధికారి జయరాజ్, మండల విద్యాధికారి వెంకట్ రెడ్డి, మెడికల్ అధికారి డాక్టర్ నాగయ్య, డాక్టర్ సంతోష, సీడీపీఓ శాంతిశ్రీ, అజీమ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



పోషణ పక్వాడ్‌లో భాగంగా బహుమతులు అందుకున్న చిన్నారులు

బీజేపీకి గుణపాఠం తప్పదు



షాద్‌నగర్ పట్టణంలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- రాహుల్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే కుట్రలు
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

షాద్‌నగర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ కుట్రలు పన్నుతోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి అన్నారు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ శనివారం షాద్‌నగర్ పట్టణంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, ముఖ్య కూడలిలో దహనం చేశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. భారత్‌జోడో యాత్రతో దేశంలోని అన్ని వర్గాలు, ప్రజలకు రాహుల్ గాంధీ దగ్గరయ్యారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే తప్పుడు సాక్ష్యాలతో కక్షసాధింపు చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్, నాయకులు జంగ నర్సింహ, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఖదీర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. ఎంత పెద్దకష్టం!

- లివర్ వ్యాధితో నిత్యం నరకం
- కడుపులో పేరుకుపోతున్న నీళ్లు
- మృత్యువుతో పోరాడుతున్న బాలుడు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



మంచానికే పరిమితమైన బాలుడు

దౌల్తాబాద్: బాలుడికి పెద్దకష్టం వచ్చింది. లివర్ వ్యాధి కారణంగా కడుపులో నీళ్లు పేరుకుపోతుండటం.. కాసింత నడవగానే ఆయాసం రావడంతో మంచానికే పరిమితమయ్యాడు బాలుడు. అసలే రెక్కాడితేకాని డొక్కాడని బతుకులు కావడంతో బాధను కడుపులోనే దిగమింగుతూ ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. మండలంలోని చల్లాపూర్‌కు చెందిన హరిజన్ లక్ష్మప్ప, వెంకటమ్మలకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. ఇందులో పెద్ద కుమార్తె వివాహం జరిపించారు. చిన్న కూతురుతో పాటు కుమారుడు ప్రకాశ్ ఉన్నారు. ప్రస్తుతం పదోతరగతి పూర్తిచేసి ఇంటివద్ద ఉంటున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు జబ్బుబారిన పడటం చూసి ఆ తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. నాలుగు నెలల క్రితం బాలుడు జ్వరం బారిన పడ్డాడు. అనంతరం ఉదరం ఉబ్బినట్లు కనిపించింది. కూలినాలి చేసుకుంటున్న తల్లిదండ్రులు ఒక్కసారిగా కుంగిపోయారు. ఎలాగైనా బిడ్డను కాపాడుకోవాలని స్థానికంగా ఉన్న ఆస్పత్రుల్లో చూపించారు. ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యులను ఆశ్రయించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు బాలుడి కడుపులో ఆపరేషన్ చేయాలని సూచించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. అయితే బాలుడికి ఇప్పటికే స్థానికంగా ఉన్న ఆస్పత్రులతో పాటు మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో పరీక్షలు నిర్వహించగా సుమారు రూ.8లక్షలు ఖర్చు అయ్యాయి. మళ్లీ ఇప్పుడు ఆపరేషన్‌కు రూ.10లక్షలు అవుతాయని వైద్యులు చెప్పడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమకు ఎకరన్నర భూమి మాత్రమే ఉందని ఇప్పటికే తలకు మించిన భారంగా ఖర్చు చేశామని చెబుతున్నారు. కొద్ది దూరం నడిస్తే ఆయాసం రావడంతో పాటు నడవడానికి ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. దినదినగండంగా బతుకీడుస్తున్న తమ కుమారుడిని కాపాడాలని వేడుకుంటున్నారు. దాతలు ఆపన్న హస్తం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి



సిల్వర్ జూబ్లీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చినజీయర్‌స్వామి తదితరులు

- శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ఎంత ఎదిగినా ఒదిగి ఉన్నప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిజీ అన్నారు. అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీ విద్యా సంస్థల్లో 25వ వార్షికోత్సవాన్ని శనివారం జేబీ గ్రూప్ విద్యా సంస్థల కార్యదర్శి జె.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చినజీయర్ స్వామీజితో పాటు పద్మశ్రీ అవార్డు గ్రహీత, సీవైఐఈఎస్‌టీ ఫౌండర్, చైర్మన్ ఆఫ్ బోర్డు మెంబర్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్‌రెడ్డి, తెలంగాణ టీఏఎఫ్ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమ శిక్షణతో అనుకున్న లక్ష్యాలను ఎంచుకొని పట్టుసాధించాలని అన్నారు. సమస్యలు వచ్చినప్పుడు వెంటనే పరిష్కరించుకుంటే భవిష్యత్తుకు మంచి మార్గం ఉంటుందన్నారు. విద్యాసంస్థల కార్యదర్శి జె.వి.కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే జేబీ గ్రూప్ విద్యా సంస్థల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వంశీధర్‌రావు, డాక్టర్ బి.దీపిక, ఆయా కళాశాలల డీన్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఉత్తమ అవార్డులు

- మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా ప్రదానం



మంత్రి, కలెక్టర్ నుంచి అవార్డులు అందుకుంటున్న సర్పంచులు, కార్యదర్శులు

నవాబుపేట: జాతీయ పంచాయతీరాజ్ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా నవాబుపేట మండలానికి చెందిన ఎల్లకొండ, మాదిరెడ్డిపల్లి, అత్తాపూర్ గ్రామాలకు జిల్లా స్థాయి అవార్డులు దక్కాయి. మౌలిక సదుపాయాలు, స్వయం సమృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత, సేఫ్ డ్రింకింగ్‌వాటర్, మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యవంతమైన పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ తదితర విషయాల్లో జిల్లా స్థాయిలో మూడు పంచాయతీలకు అవార్డులు వరించాయి. మూడు పంచాయతీల సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, యశోద, స్వరూప, ఎంపీటీసీ విజయ్ కుమార్, కార్యదర్శులు వెంకట్‌లక్ష్మి,వజ్రలింగం, చంద్రకళ శనివారం డీఆర్‌సీలో మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ నాయాయణరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదగా అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భవానీ, జెడ్పీటీసీ జయమ్మ, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంపీఓ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

కేరెల్లి, చింతకుంట జీపీలకు..

ధారూరు: జాతీయ పంచాయతీ అవార్డులను జిల్లా స్థాయిలో ధారూరు మండలం కేరెల్లి, చింతకుంట గ్రామ పంచాయతీలు అందుకున్నాయి. శనివారం మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా అవార్డులను సర్పంచులు కొత్తపల్లి నర్సింహారెడ్డి, లక్ష్మమ్మలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఏ డాక్టర్ మెతుకు ఆనంద్, జిల్లా కలెక్టర్ నారాయణరెడి, జెడ్పీటీసీ సుజాత తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో అవార్డులు దక్కించుకున్న కేరెల్లి, చింతకుంట జీపీల సర్పంచులను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మిలు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

ఉత్తమ జీపీగా చాపలగూడెం

కుల్కచర్ల: జిల్లా ఉత్తమ పంచాయతీగా కుల్కచర్ల మండలం చాపలగూడెం గ్రామపంచాయతీ ఎంపికైంది. శనివారం జిల్లా కేంద్రంలో మంత్రి సబితారెడ్డి చేతులమీదుగా గ్రామ సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీడీఓ నాగవేణికి పురస్కారం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. జిల్లా ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, ఎంపీఓ ఖరీం తదితరులు పాల్గొన్నారు.

మీర్జాపూర్ పంచాయతీకి..

పూడూరు:మండల పరిధిలోని మీర్జాపూర్‌పంచాయతీకి జాతీయ అవార్డు వరించింది. ఈ మేరకు మంత్రి సబితారెడ్డి నుంచి సర్పంచ్ సాబెరాబేగం హైమద్, కార్యదర్శి మురళీకృష్ణ అవార్డును అందుకున్నారు. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం ప్రజల సహకారంతో పకడ్బందీగా నిర్వహించామని సర్పంచ్, కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.





మంత్రి సబితారెడ్డి నుంచి జాతీయ అవార్డులను అందుకుంటున్న పూడూరు, ధారూరు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు తదితరులు